క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక


కె.అఖిలేశ్వరి


జెస్సీ ప్రవీణ

ఏలూరు టౌన్‌: జాతీయ ప్రతిభా అన్వేషణ ఉపకార వేతనం (నేషనల్‌ మీన్స్‌ కమ్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌)కు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. ఏలూరు సత్రంపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు కుందురు అఖిలేశ్వరి, ఆకుమళ్ల జెస్సీ ప్రవీణ అర్హత సాధించారని హెచ్‌ఎం కాట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గత డిసెంబర్‌ 3న జాతీయ స్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహించారని చెప్పారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రాథమిక ఎంపిక జాబితాను విడుదల చేశారని తెలిపారు. ఈ విద్యార్థినులు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం అందుతుందన్నారు. వారిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత


మాధవికి చెక్కు అందజేస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): వైద్యం, విద్య నిమిత్తం విద్యార్థినికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి రూ.10 లక్షల చెక్కు అందింది. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన ముమ్మడి వెంకట సత్యనారాయణ కుమార్తె ముమ్మడి మాధవి ఆరోగ్య పరిస్థితుల గురించి, విద్యావసరాల గురించి సీఎం జగన్‌ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం జగన్‌ మాధవికి రూ.10 వేలు మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ ఆదేశాల మేరకు బుధవారం జాయింట్‌ కలెక్టర్‌ బి.లావణ్యవేణి తన చాంబర్‌లో బుధవారం అందజేశారు.

ఆక్రమణ భూమి స్వాధీనం

ఏలూరు రూరల్‌: ఆక్రమణ భూమి జిల్లా దేవాదాయ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి సీహెచ్‌ రంగారావు తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరులోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి చెందిన 4.82 ఎకరాల భూమి ఏలూరు రూరల్‌ మండలం మల్కాపురం పరిధిలో ఉంది. ఈ భూమి తనదంటూ ఆక్రమించిన వ్యక్తి 2005లో జిల్లా కోర్టులో పిటీషన్‌ వేశారు. దీనిపై దేవదాయశాఖ అధికారులు కౌంటర్‌ వేయగా, కోర్టు భూమి దేవదాయశాఖకు చెందినదని తీర్పు వచ్చింది. దీంతో ఆక్రమణదారుడు 2008లో హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై హైకోర్టు ఆక్రమణదారుడు పిటీషన్‌ను బుధవారం కొట్టి వేసింది.

మేము సైతం 'సిద్ధం'

ఏలూరులో డివిజన్ల వారీగా పార్టీ శ్రేణులతో సమావేశాలు


7వ డివిజన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్‌ శ్రీలక్ష్మి


3వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఇడా చైర్మన్‌ బొద్దాని శ్రీనివాస్‌, మాజీ స్మార్ట్‌సిటీ చైర్‌పర్సన్‌ అఖిల


టూటౌన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్‌ గుడిదేశి శ్రీనివాసరావు


సీఎం సభకు మద్దతు తెలుపుతున్న 15 డివిజన్‌ యువత

ఏలూరు టౌన్‌: వైఎస్సార్‌ సీపీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం ఎన్నికల సన్నాహక సభకు పార్టీ ఏలూరు నియోజకవర్గం నేతలు సన్నద్ధమవుతున్నారు. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని నాయకత్వంలో సిద్ధం సభకు తరలివెళ్లేందుకు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్‌ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్‌పర్సన్‌ బొద్దాని శ్రీనివాస్‌, నగర డిప్యూటీ మేయర్‌ గుడిదేశి శ్రీనివాస్‌, పలువురు కార్పొరేటర్లు డివిజన్లలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. పార్టీ క్యాడర్‌, గృహసారథులు, పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు.

● ఏలూరు వన్‌టౌన్‌లోని 7వ డివిజన్‌లో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్‌ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవన స్థితిగతులను మార్చివేసేందుకు సీఎం జగనన్న చేస్తోన్న పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. పార్టీ నేతలు కొల్లిపర భగవాన్‌, సైదు కొండ, కోమర్తి గోపి, ఉక్కుసూరి రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

● ఏలూరు టూటౌన్‌లోని 35వ డివిజన్‌లో విమలాదేవి స్కూల్‌ వద్ద నగర డిప్యూటీ మేయర్‌ గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏలూరు జాతీయ రహదారి దెందులూరు నియోజకవర్గంలో ఆశ్రం హాస్పిటల్‌ సమీపంలో సహారా గ్రౌండ్స్‌లో లక్షలాదిమందితో సిద్ధం పేరుతో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత ఇస్తూ భరోసా కల్పిస్తోన్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్‌–2 మహిళా అధ్యక్షురాలు గుడిదేశి లక్ష్మీశారద, కొత్తల చంద్రశేఖర్‌, గేదెల సూరిబాబు, యాగాటి లక్ష్మీనారాయణ, కత్తిరి వెంకటేశ్వరరావు, ములగాల నాగరాజు, కే.వెంకటేశ్వరరావు, కాగాని అచ్చిబాబు, పిల్లా సూరిబాబు, గృహసారథులు, వలంటీర్లు ఉన్నారు.

● ఏలూరు వన్‌టౌన్‌ 3వ డివిజన్‌లో ఇడా చైర్మన్‌, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్‌ అధ్యక్షతన మాజీ స్మార్ట్‌సిటీ చైర్‌పర్సన్‌ కార్పొరేటర్‌ బొద్దాని అఖిల సతీష్‌చంద్ర ఆధ్వర్యంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈనెల 3న దెందులూరు నియోజకవర్గం ఏలూరు జాతీయ రహదారిపై నిర్వహించే సీఎం సిద్ధం సభకు భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తోన్న జగనన్నకు తోడుగా ఉండాలని కోరారు. సమావేశంలో సచివాలయ కన్వీనర్లు లావేటి రామాంజనేయులు, రెల్ల రామకృష్ణ, తిర్రి ఉషా, బళ్ల శాంతి, బుజ్జమ్మ, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

జగన్‌కు మద్దతుగా నిలవాలి

ఏలూరు రూరల్‌ : సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభ విజయవంతానికి ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని ఇడా చైర్మన్‌ బొద్దాని శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం ఏలూరు 15 డివిజన్‌లో కార్పొరేటర్‌ తంగెళ్ల రాముతో కలిసి ఆయన వైఎస్సార్‌ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారని శ్రీనివాస్‌ అన్నారు. పార్టీ సభలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావడమే దీనికి నిదర్శనమని తెలిపారు. శనివారం జరిగే సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

జాగృతికి ఆరు జాతీయ రికార్డులు


జాగృతి రికార్డులు తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో నమోదు చేసినట్టు ప్రకటిస్తున్న శ్రీనివాస్‌

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన చిన్నారి నారాయణం జాగృతి ఒకే రోజు ఆరు జాతీయ రికార్డులను సృష్టించింది. 5వ తరగతి చదువుతున్న జాగృతి పదేళ్ల వయసులోనే ఇప్పటి వరకు 60 రికార్డులను తన పేరిట లిఖించుకుంది. బుధవారం స్థానిక బీడీ కాలనీలోని సెయింట్‌ ఆంథోని స్కూల్‌లో ఏలూరు విజన్‌ లయన్స్‌ క్లబ్‌, పెదవేగికి చెందిన ఎస్‌ఎంసీ స్కూల్‌, సెయింట్‌ ఆంథోని స్కూల్‌లో నిర్వహించిన జాతీయ బాలికాదినోత్సవ కార్యక్రమంలో జాగృతి ఈ ఘనత సాధించింది. 15 నిమిషాల వ్యవధిలో 75 నినాదాలు, తెలుగు పర్యాయపదాల ధారణ, హిందీ పర్యాయపదాల ధారణ, ఆంగ్ల పదాలకు విశేషణ పదధారణ, హిందీలో లింగబేధ వాక్యాలు, తెలుగు సాహితీ మూర్తుల ముఖ్య చిత్రాలను గుర్తించే అంశాల్లో చిన్నారి విశేషంగా ఆకట్టుకుంది. ఈ మేరకు తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ చీఫ్‌ కోఆర్డినేటర్‌ సిరిమువ్వ శ్రీనివాస్‌ సమక్షంలో చిన్నారి చేసిన ప్రదర్శనను తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ రికార్డుల్లో నమోదు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ జిల్లా గవర్నర్‌ గట్టిం మాణిక్యాలరావు, సెయింట్‌ మేరీస్‌ ఎడ్యుకేషనల్‌ సొసైటీ చైర్మన్‌ డోమినిక్‌ చుక్కా, సెయింట్‌ ఆంథోని స్కూల్‌ చైర్మన్‌ అవినాష్‌ రాజు, జిల్లా చైల్డ్‌ ప్రొటెక్షన్‌ అధికారి సీహెచ్‌ సూర్యచక్రవేణి, ఏలూరు ఎంఈఓ–2 రూపావతు రంగయ్య, బీవీ రమణమూర్తి, కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతే లక్ష్యం

ఏలూరు టౌన్‌: రైల్వే ప్రయాణికుల భద్రత, ప్రయాణంలో జరిగే ప్రమాదాల నివారణపై విద్యార్థులో అవగాహన కల్పించేందుకు ఏలూరు రైల్వే ఏఎస్‌ఐ పి.సైమన్‌ ఏలూరు పవర్‌పేటలోని శ్రీ వాణి పబ్లిక్‌ స్కూల్లో బుధవారం అవగాహన కల్పించారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌ ఆదేశాల మేరకు ఏలూరు నగరంలో పలు ప్రాంతాల్లో రైల్వే పోలీస్‌ అధికారులు ప్రజలకు, ఆటోవాలాలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైలులో గంజాయి, మద్యం రవాణా చేయకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. రైలులో మండే వస్తువులను తీసుకెళ్లడం ప్రమాదకరమన్నారు. రైలులో నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీఐ కేవీఎస్‌ ప్రసాద్‌

ఏలూరు టౌన్‌: ప్రధాన రహదారి కూడళ్లలో రోడ్డు దాటే సమయంలో ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ను పాటిస్తూ వెళ్లాలని, రోడ్డు నిబంధనలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడతారని మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ కేవీఎస్‌ ప్రసాద్‌ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వట్లూరు సిద్ధార్థ విద్యాలయ పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతా నియామాలు, ట్రాఫిక్‌ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పోలీస్‌, రవాణాధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.ప్రసాద్‌, అసిస్టెంట్‌ మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ అజ్మీరా బద్దు, జి.స్వామి, రోడ్డు భద్రత వైద్యురాలు జి.మౌనిక, ప్రిన్సిపాల్‌ పీఎస్‌ఎన్‌ కుమారి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గుండుగొలను విద్యార్థి

భీమడోలు: అండర్‌ 14 సాఫ్ట్‌బాల్‌ బాలుర విభాగంలో గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గంటా అజయ్‌ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గుంటూరులో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన సాఫ్ట్‌బాల్‌ రాష్ట్ర స్థాయి పోటీల్లో గంటా అజయ్‌ అత్యుత్తమ ప్రతిభను కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే పోటీల్లో అజయ్‌ పాల్గొంటారని హెచ్‌ఎం గారపాటి కనకదుర్గా సునీత పేర్కొన్నారు. ఎంఎస్‌ఆర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి అజయ్‌ను, శిక్షణనిచ్చిన పీడీఓ వి.వెంకటేశ్వరరావు, కృష్ణారావును అభినందించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	34
వంకాయలు (కాంతులు)	20	బీరకాయలు	38
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	64
బెండకాయలు	40	ములక్కాడలు	10–12
పచ్చిమిర్చి	34	కంద	60
కాకర కాయలు	54	బీట్‌రూట్‌	34
బీరకాయలు	44	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్‌	60
క్యాబేజీ	25–30	అల్లం	120
క్యారెట్‌	20	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	08
దోసకాయలు	30	పుదీనా	05
అనబకాయ (1)	20–25	క్యాప్సికమ్‌	70
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు –ఈసీఐఎల్‌	22.30	4814	29
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్‌	22.15	4822	00
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	20.40	98517	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	22.10	98503	00

మల్లేశ్వరికి ఆత్మీయ సత్కారం


మల్లేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మేడిది మల్లేశ్వరిని డీపీఆర్‌ఓ ఆర్‌వీఎస్‌ రామచంద్రరావు, సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం స్థానిక డీపీఆర్‌ఓ కార్యాలయంలో పదవీ మల్లేశ్వరికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీపీఆర్‌ఓ రామచంద్రరావు మాట్లాడుతూ 21 సంవత్సరాలు సమాచార శాఖలో అంకిత బావంతో విధులు నిర్వహించిన మల్లేశ్వరి అందరి ఆదరాభిమానాలు పొందారని కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ పదవి విరమణ సహజమని, వారి సర్వీసులో ఉండగా చేసిన సేవలు సహ ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కె.ధనుంజయరాజు, సీహెచ్‌ రాంబాబు, కె.సూర్యనారాయణ, డి.శౌరి ప్రసాద్‌, టి.బాబూరావు, పత్తి సాగర్‌, ఎస్‌ గంగాధర్‌, రామారావు, పి.శారద, జీవీ రత్నం, ఎస్‌ సంధ్యాకమల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీతో భరోసా


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌ విజయనిర్మల

ఏలూరు టౌన్‌: దివంగత మహానేత డాక్టర్‌ వైఎస్సార్‌ దేశంలో ఎక్కడలేని విధంగా నాడు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి రాష్ట్రంలోని లక్షలాది మంది పేదలకు ఆరోగ్య భరోసా కల్పించారని, నేడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మరింత లబ్ధి చేకూర్చేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారని కార్పొరేటర్‌ జిజ్జువరపు విజయనిర్మల అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 16వ డివిజన్‌లో బుధవారం ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజలకు వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మంది పేదలకు రూపాయి ఖర్చు లేకుండా లక్షల రూపాయల విలువ చేసే శస్త్ర చికిత్సలు, ఉచితంగా చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడం ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు మరింత మేలు చేకూరుతుందని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆళ్ల నానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి రావాలని ఆకాంక్షించారు.

కొల్లేరును రక్షించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కృష్ణారావు, కొల్లేరు నాయకులు

ఏలూరు టౌన్‌: ఏలూరు జిల్లాలో లక్షకుపైగా ఎకరాల్లో ఉన్న సహజసిద్ధం మంచినీటి సరస్సు కొల్లేరును కాపాడుకుందామని పాండిచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. కొల్లేరు పరిరక్షణ నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కొల్లేరు బతుకు చిత్రంపై అరుణోదయ, విమలక్క గానం చేసిన సీడీని బుధవారం ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో కొల్లేరు సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొల్లేటి వాసుల జీవనం, చేపల వేటగానే కొనసాగుతుందన్నారు. సంస్కృతిని గుర్తించి మెరుగైన విద్య అందించాలని కోరారు. ఉప్పుటేరు వద్ద వాటర్‌ రెగ్యులేటర్‌ నిర్మించాలని కోరారు. ఐదడుగులలోతు నీరు ఉండేలా, వలసల నివారణకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. కొల్లేరు ప్రజలు ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు నాయకులు ఉన్నారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి ధర్నా

ఏలూరు టౌన్‌: ప్రేమించానని మాయమాటలు చెప్పి గర్భందాల్చాక పెళ్లికి నిరాకరించాడంటూ ఓ యువతి ఏలూరు టైటాస్‌ నగర్‌లోని యువకుడి ఇంటి ఎదుట బుధవారం ధర్నాకు దిగింది. యువతి ఫిర్యాదు మేరకు టూటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. టైటాస్‌ నగర్‌కు చెందిన పి.చిన్నూ డిగ్రీ చదువుకుంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి అతనితో సన్నిహితంగా మెలిగేది. ఈ క్రమంలోనే ప్రేమ పేరుతో లోబర్చుకుని శారీరకంగా సన్నిహితంగా ఉండటంతో గర్భం దాల్చానని మందులు ఇచ్చి గర్భం పోయేలాగా చేశాడని యువతి పేర్కొంది. తనకు చిన్నూతో వివాహం చేయాలని కోరింది. ఇదిలా ఉండగా.. ఆమెకు తొలుత వేరే వ్యక్తితో వివాహమైందని, ఓ బిడ్డను కూడా ఉందని, ప్రస్తుతం భర్తను విడిచిపెట్టి విడిగా ఉంటుందని బెదిరింపులకు పాల్పడి చిన్నూను వివాహం చేసుకోవాలని చూస్తుందని యువకుడి బంధువులు, స్థానికులు చెబుతున్నారు.

పులిజాడ కోసం ట్రాప్‌ కెమెరాల ఏర్పాటు

ద్వారకాతిరుమల: గత కొద్దిరోజులుగా ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల ప్రజలను వణికిస్తున్న పెద్ద పులిని పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు శ్రమిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని ఐఎస్‌ జగన్నాథపురం అటవీ ప్రాంతంలోని చెట్లకు బుధవారం ట్రాప్‌ కెమెరాలను అమర్చారు. అలాగే ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో టాంటాం వేయించారు. ఇదిలా ఉంటే ఐఎస్‌ జగన్నాథపురం కొండపైకి పులి వచ్చిందంటూ కొందరు వదంతులు సృష్టించారు. దాంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చివరకు అవి వదంతులని తెలిసి అంతా ఊపిరిపీల్చుకున్నారు.

శస్త్రచికిత్సకు సొమ్ము పంపిణీ


బాధితుడికి నగదు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాని చిత్రంలో కార్పొరేటర్‌ శ్రీదేవి

ఏలూరు టౌన్‌ : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యసేవలు, చికిత్సలు అందించాలనే లక్ష్యంతో వైద్యరంగంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరాంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు వన్‌టౌన్‌ 7వ డివిజన్‌కు చెందిన తొండపు నాగేశ్వరరావుకు మోకాలు రిప్లేస్‌మెంట్‌ శస్త్రచికిత్సకు రూ.70 వేల చెక్కును బుధవారం ఎమ్మెల్యే నాని చేతులు మీదుగా అందజేశారు. ప్రతి పేదవానికీ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని నాని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పిల్లంగోళ్ల శ్రీదేవి, కోఆప్షన్‌ సభ్యులు ఎస్‌ఎంఆర్‌ పెదబాబు ఉన్నారు.

మచిలీపట్నం కమిషనర్‌గా బాపిరాజు


బాపిరాజును సత్కరిస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్‌ : ఏలూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా మచిలీపట్నం కమిషనర్‌గా వెళ్తున్న సీహెచ్‌ బాపిరాజును ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం ఏలూరు వన్‌టౌన్‌ 7వ డివిజన్‌లోని సచివాలయంలో ఆయనకు రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్‌ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, 7వ డివిజన్‌ కార్పొరేటర్‌ పిల్లంగోళ్ల శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఏలూరు నగరంలో ఆయన ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేశారని కొనియాడారు. ఆయన మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.

మొక్కజొన్న పరిశీలన

పెదపాడు: మొక్కజొన్న పంట వేసేటప్పుడు నీటి పరీక్ష తప్పని సరిగా చేసుకోవాలని ఏఓ వానపల్లి ప్రదీప్‌కుమార్‌ తెలిపారు. మండలంలోని పునుకొల్లులో మొక్కజొన్న, అపరాల పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.